ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
శనివారం 6 జనవరి 2024



ఆది నుంచీ అంతే!

విజయవాడ ఎంపీ కేశినేని నాని.. తొలి నుంచి తన దుందుడుకు వైఖరితో వార్తల్లో ఉంటూ వచ్చారు. ఎంపీగా ఉంటూ 2017లో రవాణాశాఖ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యంతో ఘర్షణ పడటం.. పార్టీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్‌పై పార్టీ నాయకుల వద్ద, బహిరంగంగానూ కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం వంటి విషయాలతో వివాదాలకు కేంద్ర బిందువుగా ఉంటూ వచ్చారు.

నియోజకవర్గ ఇన్‌చార్జుల స్థానంలో వేరొకరికి ప్రోత్సాహం

- పార్టీ అధినేత చంద్రబాబు, లోకేశ్‌పై దుందుడుకు వ్యాఖ్యలు
- ఓ దశలో కేశినేని భవన్‌లో చంద్రబాబు ఫొటోలు తొలగింపు
- తాను ఎన్నికల్లో పోటీ చేయబోనని అధినేతకు బెదిరింపులు
- పలుమార్లు ట్విటర్‌లో అధినేతను కించపరిచేలా పోస్టులు
- 2017లో రవాణా కమిషనర్‌తో రగడ.. పార్టీకి తలవొంపులు
- వివాదాలకు కేరాఫ్‌గా ఎంపీ కేశినేని నాని వైఖరి

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ఎంపీ నానీ వ్యవహార శైలిపై చాలా కాలం నుంచి పార్టీలో చర్చ నడుస్తోంది. 'నోటిని అదుపులో పెట్టుకోలేని ఆయన దాన్ని కప్పిపుచ్చుకునేందుకు తాను ముక్కుసూటిగా ఉంటానని చెప్పుకుంటుంటారు. 2019లో టీడీపీ ఘోర పరాజయం తర్వాత నాని ధోరణి మరింత మారిపోయింది. పార్టీ కంటే తన చరిష్మానే ఎక్కువ అన్న తరహాలో ఆయన వ్యాఖ్యలు ఉండేవి. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినా గెలుస్తానని బహిరంగంగా ఆయన వ్యాఖ్యానించడమే ఆయన ధోరణికి అద్దం పడుతోంది' అని ఓ టీడీపీ నేత ఎంపీ నాని శైలిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ ధోరణి కారణంగా పార్టీ అధినేత చంద్రబాబు, లోకేశ్ విషయంలో ఆయన తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసేవారు. ఆయన చేసిన ట్వీట్లను పరిశీలిస్తే ఈ విషయం అవగతమవుతుంది. 2019 జూలైలో.. 'చంద్రబాబు గారు.. నాలాంటి వాళ్లు పార్టీలో వద్దనుకుంటే చెప్పండి. ఎంపీ పదవికి, పార్టీకి వెంటనే రాజీనామా చేస్తా. నాలాంటి వాళ్లు పార్టీలో కొనసాగాలనుకుంటే మీ పెంపుడు కుక్కలను కంట్రోల్ చేయండి' అని ఓసారి, 'రాజకీయ జన్మలు, పునర్జన్మలు రాజకీయ భవిష్యత్తులు గుళ్లో కొబ్బరిచిప్ప దొంగలకి, కాల్‌మనీ గాళ్లకి, బ్రోకర్లు, పైరవీదారులకు అవసరం. నాకు అవసరం లేదు' అని మరోసారి నాని ట్వీట్ చేశారు. వీటి ద్వారా తలెత్తిన సమస్యలను సరిచేయడం పార్టీ అధిష్ఠానానికి తలనొప్పిగా మారేది.

ప్రాధాన్యత ఇచ్చినా మారని తీరు..

చంద్రబాబు ఎనాడూ కేశినేని నానికి ప్రాధాన్యతను తగ్గించలేదు. కానీ నాని మాత్రం అధినేత

- మిగతా 6లో

అవకాశాన్ని అందిపుచ్చుకున్న 'సోదరుడు'

2019 ఎన్నికల తర్వాత టీడీపీ ఇక కోలుకోవడం కష్టమని తరచూ సన్నిహితుల వద్ద నాని వ్యాఖ్యలు చేసేవారు. అదే ఉద్దేశంతో పలుమార్లు పార్టీ సమావేశాల్లో తాను 2024 ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేయబోనని పార్టీ అధినేతకు బెదిరింపు ధోరణిలో చెప్పేవారు. ఈ కారణంగానే విజయవాడ ఎంపీ స్థానానికి టీడీపీ అధిష్ఠానం ప్రత్యామ్నాయాన్ని అన్వేషించడం ప్రారంభించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాని సోదరుడు చిన్ని తెరపైకి వచ్చారు. కానీ పార్టీ మాత్రం ఏనాడూ చిన్నికి విజయవాడ ఎంపీ స్థానాన్ని కేటాయిస్తున్నట్టు ప్రకటించలేదు. నాని వైపే అధిష్ఠానం మొగ్గుచూపుతూ వచ్చింది. పరిస్థితులను బట్టి చిన్నికి ఏదో ఒక స్థానంలో అవకాశం కల్పించాలన్న అభిప్రాయంలో పార్టీ అధిష్ఠానం ఉంది. కానీ నాని వైఖరి పార్టీ శ్రేణులు చిన్ని వైపు మొగ్గేలా చేస్తోంది.



నేడు గుడివాడలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు

గుడివాడ, జనవరి 5 : "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" శనివారం జరగనున్నాయి. వెనిగండ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుడివాడ ఏలూరురోడ్‌లోని వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలో శనివారం ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయి. జిల్లా స్థాయిలో జరిగే ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మొదటి బహుమతిగా రూ.6వేలు, రెండో బహుమతిగా రూ.4వేలు, మూడో బహుమతిగా రూ.3వేలను ఇవ్వనున్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనేవారు నిర్ణీత సమయానికన్నా 30 నిమిషాలు ముందుగానే పోటీలు జరిగే ప్రాంతానికి చేరుకుని తమ పేరును రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. పోటీల్లో పాల్గొన్నవారికి కన్సొలేషన్ బహుమతులను అందించనున్నారు.

జేసీగా గీతాంజలి శర్మ బాధ్యతల స్వీకరణ



మచిలీపట్నం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : జాయింట్ కలెక్టర్‌గా గీతాంజలి శర్మ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సంక్షేమ కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తానని ఆమె అన్నారు. కృష్ణా జిల్లా అత్యంత చైతన్యవంతమైన జిల్లాగా ఉందని, అన్ని ప్రాంతాల్లో పర్యటించి అవగాహన పెంచుకుంటానని తెలిపారు. అనంతరం ఆమె కలెక్టర్ పి.రాజాబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల చలో విజయవాడ ఉద్రిక్తం

శ్రామిక వర్గం పోరుబాట పట్టింది. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఇప్పటికీ అమలు చేయకపోవడంపై రోడ్డెక్కి, గర్జిస్తోంది. నిరవధిక దీక్షలతో అంగన్వాడీలు ప్రభుత్వానికి చెమటలు పట్టిస్తే.. మున్సిపల్ కార్మికులు ఉద్యమ శంఖారావం పూరించారు. ఇప్పుడు రాష్ట్ర సమగ్రశిక్షా అభియాన్ (ఎస్‌ఎస్‌ఏ) ఉద్యోగులు శుక్రవారం చలో విజయవాడలో భాగంగా ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం ముట్టడికి యత్నించారు. పోలీసులు అడ్డుకున్నా.. అదుపులోకి తీసుకుని కనిపించిన కళ్యాణ మండపాల్లో నిర్బంధించినా ఆగలేదు. బంధనాలు తెంచుకుని నిరసన తెలపడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.



మహిళను చుట్టుముట్టిన పోలీసులు



ఉద్యోగుల బైఠాయింపులో చంటిబిడ్డతో తల్లి నినాదాలు

వేలాది మంది ఉద్యోగులు విజయవాడ చేరిక

- ఎస్‌పీడీ కార్యాలయం ముట్టడికి ప్రయత్నం
- ఉద్యోగులను ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్న పోలీసులు

- శివారుల్లోని కల్యాణ మండపాలకు తరలింపు
- ఆటోనగర్ ఏటీఏ కల్యాణ మండపం వద్ద ఉద్రిక్త పరిస్థితులు
- గోడలు దూకి ఎస్‌పీడీ కార్యాలయం వైపు పరుగులు
- డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్నా పట్టించుకోరా? : ఉద్యోగులు

ఆటోనగర్ (పెనమలూరు), జనవరి 5 : గత ఎన్నికలకు ముందు జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలుచేయాలని ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు చేపట్టిన చలో విజయవాడ శుక్రవారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సమగ్ర శిక్ష అభియాన్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పిలుపు మేరకు వేలాది మంది ఉద్యోగులు చలో విజయవాడ కార్యక్రమానికి వచ్చారు. బస్‌స్టాండ్లలో, రైల్వే స్టేషన్లలో విజయవాడ తరలివచ్చిన ఉద్యోగులను పోలీసులు అడ్డుకోవడానికి విశ్వప్రయత్నాలు చేశారు. వారి కళ్లుకప్పి వేలాదిగా ఉద్యోగులు పటమట హైస్కూలు రోడ్డులోని రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టరు కార్యాలయ సమీపానికి చేరుకొని ఆందోళన చేశారు. విజయవాడ పటమట హైస్కూలు రోడ్డులోకి చేరిన వేలాది మంది ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులతో పంటకాల్వ రోడ్డు పరిసరాలు జనసంద్రంగా మారాయి. ఎస్‌ఎస్‌ఏ కార్యాలయం వైపు ఉద్యోగులు కదిలి వెళ్లబోతుండగా అడ్డుకున్న పోలీసులు ఎక్కడికక్కడ ఉద్యోగులను అదుపులోకి తీసుకొన్నారు. అయినా వెరవక ఉద్యోగులు పోలీసుల చెరను ఛేదించి కార్యాలయంవైపు వెళ్లే ప్రయత్నం చేశారు. ఉద్యోగులను అదుపులోకి తీసుకొని పదుల సంఖ్యలో వాహనాల్లో ఆటోనగర్ ఏటీఏ కల్యాణ మండపం, పటమట సాయిబాబా కల్యాణ మండపంలో నిర్బంధించారు. ఆ నిర్బంధాలను ఛేదించిన ఉద్యోగులు కల్యాణ మండపం గోడలు దూకి పటమట వైపు దౌడు తీయడం ప్రారంభించడంతో బిత్తరపోయిన పోలీసులు వారిని వెంబడించి తిరిగి అదుపులోకి తీసుకొని కల్యాణమండపానికి తరలించే సమయంలో

- మిగతా 6లో

ఆర్టీసీ సంక్రాంతి బస్సులు -1004

- నేటి నుంచి నడపనున్న స్పెషల్ బస్సులు
- షెడ్యూల్ విడుదల చేసిన అధికారులు
- సొంతూళ్లకొచ్చేవారి కోసం స్పెషల్స్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆర్టీసీ అధికారులు శుక్రవారం సంక్రాంతి స్పెషల్ బస్సుల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ దఫా పండగకు సొంతూళ్లకు రాకపోకలు సాగించటానికి రికార్డు స్థాయిలో 1004 బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. కిందటి ఏడాదిలాగానే ఈసారి కూడా అదనపు చార్జీలు లేకుండానే.. స్పెషల్ బస్సులు నడుపుతున్నట్టు ప్రకటించారు. పండగ ముందు, పండగ తర్వాత కలుపుకుని హైదరాబాద్‌కు 345 బస్సులు, రాజమండ్రికి 225 బస్సులు, విశాఖపట్నం 124 బస్సులు, బెంగళూరు 7 బస్సులు, చెన్నై 31 బస్సులు, డిమాండ్‌ను బట్టి ఇతర రూట్లకు 272 బస్సుల చొప్పున ఆర్టీసీ అధికారులు ప్రణాళికలు రూపొందించుకున్నారు. జనవరి 6న 47 బస్సులు, జనవరి 7న 47, జనవరి 8న 32, జనవరి 9న 28 బస్సులు, జనవరి 10న 30 బస్సులు, జనవరి 11న 80 బస్సుల చొప్పున నడపనున్నారు. సరిగ్గా భోగి పండగకు ముందు జనవరి 12న 113 బస్సులు, జనవరి 13న 128 బస్సులు, జనవరి 14న 125 బస్సులు చొప్పున నడపనున్నారు. పండగ రోజు మాత్రం అంటే జనవరి 15న 70 బస్సులు, జనవరి 16న 23 బస్సులు చొప్పున నడపనున్నారు. కనుమ తర్వాత అంటే జనవరి 17న 141 బస్సులు, జనవరి 18న 116, జనవరి 19న 71 బస్సుల చొప్పున నడపనున్నారు.

బందరులో భారీ చోరీ

రూ.5 లక్షలు సహా 100 కాసుల బంగారం అపహరణ

మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి : స్థానిక రాజుపేటలో శుక్రవారం భారీ చోరీ జరిగింది. రూ.5 లక్షలతో పాటు 100 కాసుల బంగారం అపహరణకు గురైంది. ఇనగుదురుపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజుపేటకు చెందిన ధాన్యం, బియ్యం వ్యాపారి పద్మనాభుని చిననాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయం ఇంటికి తాళాలు వేసి విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. తిరిగి రాత్రి ఇంటికి వచ్చి చూడగా, ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లోని బీరువా పగులగొట్టినట్టు ఉండటంతో చిననాగేశ్వరరావు పోలీసులకు సమాచారం ఇచ్చారు. శుభకార్యం ఉండటంతో బ్యాంక్ లాకరులో ఉన్న నగలను ఇటీవలే ఇంటికి తీసుకొచ్చారు. ఘటనా స్థలాన్ని ఇనగుదురుపేట సీఐ ఉమామహేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పరిశీలించారు. ఎంతమేర నగలు, నగదు దొంగతనం జరిగిందనే అంశంపై వివరాలు సేకరిస్తున్నామని, వేలిముద్రలు సేకరిస్తున్నామని సీఐ తెలిపారు.

కొవిడ్ తర్వాత..

ఆంగ్ల ప్రచురణలు పెరిగాయి

- వీబీఎఫ్ఎస్ అధ్యక్షుడు మనోహరనాయుడు



"ప్రచురణ రంగంలో తెలుగు పుస్తకాలకు రెండు తెలుగు రాష్ట్రాల్లో పోటీ ఎక్కువగా ఉండేది. కొవిడ్ తర్వాత పరిస్థితి మారింది. ఆంగ్ల పుస్తకాల ప్రచురణలు బాగా పెరిగాయి. అదే సమయంలో కొనుగోళ్లు పెరిగాయి" అని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ(వీబీఎఫ్ఎస్) అధ్యక్షుడు మనోహరనాయుడు అన్నారు. పుస్తకమహోత్సవంలో ప్రస్తుతం జరుగుతున్న కొనుగోళ్లు, ప్రచురణల్లో వచ్చిన మార్పులపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

? ఆంగ్ల పుస్తకాల కొనుగోళ్లు పెరుగుతున్నాయా

అవును. ప్రస్తుతం జరుగుతున్న పుస్తక మహోత్సవంలో ఆంగ్ల పుస్తకాల కొనుగోళ్లు పెరిగాయి. వాస్తవానికి కొవిడ్ తర్వాత ప్రచురణరంగంలో మార్పులు వచ్చాయి. ఆంగ్ల పుస్తకాల ప్రచురణ విపరీతంగా పెరిగింది.

? ఏ స్థాయిలో కొనుగోళ్లు జరుగుతున్నాయి

గడచిన ఏడాది పుస్తక మహోత్సవంలో ఆంగ్ల పుస్తకాల కొనుగోలు 10-25శాతం ఉండేది. ఇప్పుడు 75 శాతానికి పెరిగింది. ఆంగ్లలో ఉన్న కథలు, నవలలు, డిటెక్టివ్ నవలలు, మ్యాజిక్ పుస్తకాలను ఎక్కువగా పాఠకులు కొనుగోలు చేస్తున్నారు. వాటితోపాటు మెడికల్, హెల్త్, సైన్స్ ప్రయోగాలకు సంబంధించిన పుస్తకాలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

? ఏయే ప్రచురణలు ఎక్కువగా వచ్చాయి

ఆక్స్‌ఫర్డ్, పెంగ్విన్, ట్వింకిల్ వంటి ప్రచురణ సంస్థలు కొత్త పుస్తకాలను మార్కెట్లోకి తీసుకొచ్చాయి.

? తెలుగు పుస్తకాల విక్రయాలు ఎలా ఉన్నాయి

తెలుగు భాషను సజీవంగా ఉంచాలన్న ఆకాంక్ష విదేశాల్లో స్థిరపడిన తెలుగు వారిలో ఎక్కువగా కనిపిస్తోంది. ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్లు ఇచ్చి వేలాది రూపాయల పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. రామాయణం, భాగవతం, చందమామ కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు, బామ్మ చెప్పిన కథలు వంటి బాలసాహిత్య పుస్తకాలకు ఎక్కువ ఆర్డర్లు వస్తున్నాయి.

? ఈ ఏడాది ప్రత్యేకత ఏమిటి

డిసెంబరు నెలలో వరుసగా బుక్ ఫెస్టివల్స్ జరుగుతాయి. ముందుగా హైదరాబాద్, తర్వాత చెన్నై, ఆ తర్వాత విజయవాడ పుస్తక మహోత్సవం ఉంటుంది. ఇదొక చైన్‌లా సాగుతుంది. అన్నింటిలో ప్రచురణకర్తలు పాల్గొంటారు. ఈసారి హైదరాబాద్ బుక్‌ఫెస్టివల్ జరగలేదు. అయినా ప్రచురణకర్తలు భారీ సంఖ్యలో రావడం సంతోషకరం. - **విజయవాడ సిటీలైఫ్ (ఆంధ్రజ్యోతి)**

కథ.. కనికట్టు

» బాలసాహిత్యంపై పిల్లలకు శిక్షణ » ఇదే భాషకు బలం


విద్యార్థులకు బొమ్మలు చూపి వ్యాసాలు రాయిస్తున్న ఉపాధ్యాయులు

ఎలుగుబంటి.. ఏనుగు.. చీమలు.. ఈ మూడింటిని చిన్నారులు పుస్తకాల్లో ఎల్‌కేజీ నుంచి చూస్తూనే ఉంటారు. ఈ మూడింటిపైనా ఏ వ్యాసం రాయాలన్నా వాటి గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలి. అప్పుడే వాటి మీద కవిత అయినా, కథ అయినా పుట్టుకొస్తుంది. ఇలా చిన్నారుల్లో కథా సాహిత్యంపై అభిలాషను పెంచాలని పుస్తక మహోత్సవ నిర్వాహకులు భావించారు. ఇది భాషా పరిరక్షణకు ఎంతగానో దోహదపడుతుందని చెబుతున్నారు.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ సిటీలైఫ్)

పాఠ్యపుస్తకాల పరిధితో సంబంధం లేకుండా కథలు, కవితలు, సాహిత్య పుస్తకాలను చదివించేందుకు ఇటు నిర్వాహకులు, అటు ఉపాధ్యాయులు, భాషావేత్తలు అనేక ప్రయోగాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఒక అంశం చెప్పి దానితో సొంతంగా పిల్లలతో కథలు చెప్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈసారి ఈ తరహా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. పుస్తక మహోత్సవంలో శ్రీరమణ ప్రతిభా వేదికపై బాలలకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. బొమ్మలు చూపి వాటి ద్వారా కథలు చెప్పించడం, ఒక అంశం ఇచ్చి దానిపై కథలు చెప్పించడం చేస్తున్నారు. రోజుకు ఒక పాఠశాల విద్యార్థులను గ్రూపులుగా కూర్చోబెట్టి ఒక్కొక్కరితో కథ చెప్పిస్తున్నారు. అక్కడ జడ్జిగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులు చెప్పిన కథలో తప్పులు ఎక్కడ జరిగాయో తెలియజేస్తూ, వాటిని సరిచేసుకునే విధానాన్ని వివరిస్తున్నారు. కథను ప్రారంభించే విధానం, ఒక వరుస క్రమంలో చెప్పే అంశం, ముగించే విధానాన్ని తెలియజేస్తున్నారు. ముందుగా కథలు అల్లడం నేర్చుకుంటే, ఆ తర్వాత రాసే మెట్టును ఈ విద్యార్థులు ఎక్కుతారని నిర్వాహకులు చెబుతున్నారు. ఈ కార్యక్రమాలకు పుస్తక మహోత్సవంలో బాగా స్పందన లభిస్తోంది. ఈ పోటీలకు విద్యార్థులను పంపడానికి పాఠశాలలు ఆసక్తిని చూపిస్తున్నాయి.

బాలల కోసం రాజ్యాంగ పుస్తకం

విజయవాడ కల్చరల్ : దేశంలో ప్రజాస్వామ్యం, మానవ హక్కులు సురక్షితంగా వుండాలంటే చిన్నతనం నుంచే రాజ్యాంగం, రాజ్యాంగ విలువల పట్ల అవగాహన పెంచుకోవాలని శాసనమండలి సభ్యుడు విద్యావేత్త కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. వీజీఎస్ ప్రచురించిన 'బాలల కోసం భారత రాజ్యాంగ



ప్రవేశిక' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజ్యాంగానికి పునాదిలాంటి రాజ్యాంగ పీఠికను పిల్లలకు అర్థమయ్యేలా చేసేందుకు ఈ పుస్తకాన్ని తీసుకొచ్చినట్టు తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మాల్యాద్రి తదితరులు ప్రసంగించారు. వీజీఎస్ పబ్లిషర్స్ అధినేత శీరం నారాయణరావు పాల్గొన్నారు. పుస్తకాన్ని సభలో ఉచితంగా పంపిణీ చేశారు.

కథల సాహిత్యంలో పూసపాటిది సుస్థిరస్థానం

విజయవాడ కల్చరల్ : రాజ్యాలు పోయినా భేషజాలు మిగిలిన రాజుల జీవితాలలోని విషాదాలను హాస్యంగా వ్యక్తీకరించిన రచయిత పూసపాటి కృష్ణంరాజని పాత్రికేయులు తాడి ప్రకాశ్ అన్నారు. తమ సామాజికవర్గంలోని లోపాల గురించి తామే విమర్శించుకోగలగడం విశేషమన్నారు. ప్రముఖ రచయిత కల్లూరి భాస్కరం మాట్లాడుతూ, చాలా తక్కువ కథలతో సాహిత్యంలో సుస్థిరస్థానం ఏర్పాటు చేసుకొన్న ఘనత పూసపాటి కృష్ణంరాజుకు దక్కుతుందని చెప్పారు. ఆయనను ప్రముఖ రచయిత పతంజలి తన గురువుగా భావించారన్నారు. తన కథలో మారుమూల శ్రీకాకుళం మాండలికాన్ని హృద్యంగా పొదిగారన్నారు. మహ్మద్ ఖదీర్‌బాబు మాట్లాడుతూ, పుస్తక మహోత్సవంలో స్థానిక విద్యార్థులను మిళితం చేయాలని సూచించారు. సభలో సాహితీ ప్రచురణల ప్రతినిధి సాందీపని పాల్గొన్నారు.



భాషకు, భావానికి ప్రాణం ఉచ్ఛారణే

విజయవాడ కల్చరల్ : సరైన ఉచ్ఛారణే ఏ బాషకైనా, భావానికైనా ప్రాణం పోస్తుందని మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. కేతు విశ్వనాథరెడ్డి రచించిన 'సరైన ఉచ్ఛారణ' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సినిమా, పొలిటికల్, స్టూడెంట్స్, పాత్రికేయులకు ఈ పుస్తకం మరింత ఉపయోగకరంగా వుంటుందన్నారు. పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సంస్థ అధ్యక్షులు గోళ్ల నారాయణరావు సభకు అధ్యక్షత వహించారు. ఈ పుస్తకం చదవడం వల్ల ఆంగ్లంలో ఉచ్ఛారణాదోషాలను సరిచేసుకోవడం తేలికవుతుందన్నారు.



నేడు 6గం.లకు ప్రజాశక్తి బుక్‌హౌస్ పుస్తకావిష్కరణ
7గం.లకు ఎమెస్కో పుస్తకావిష్కరణ

నడిచే విజ్ఞాన సర్వస్వం రాంభట్ల



విజయవాడ కల్చరల్, జనవరి 5 : భారతీయ తత్వశాస్త్రాలు, వేదాలు, పురాణ చరిత్ర, సాహిత్యం తదితర అంశాలను ప్రపంచంలోని ఇతర వాఙ్మయాలతో శాస్త్రీయంగా పోల్చి, సమన్వయం చేయడం రాంభట్ల కృష్ణమూర్తి ప్రత్యేకత అని ప్రముఖ పాత్రికేయులు, రచయిత కల్లూరి భాస్కరం అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవం తొమ్మిదో రోజు శుక్రవారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై రాంభట్ల కృష్ణమూర్తి శతజయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాంభట్లను బడిచదువు లేని బహుముఖ ప్రజ్ఞాశాలిగా వర్ణించారు. సంక్లిష్టమైన విషయాలను సరళంగా అర్థమయ్యేలా వివరించడం ఆయన ప్రత్యేకతన్నారు. దేశంలో మతం జ్ఞానానికి అడ్డంగా మారిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాంభట్ల కృష్ణమూర్తి రచనలు అందరూ చదవాలన్నారు. ఆర్యావర్తం అనే భారత భౌగోళిక భూభాగానికి పరిమితమైనది కాదని రాంభట్ల నిరూపించాడన్నారు. భారతీయ నాగరికత ప్రస్తుతం బైకాల్ అని పిలిచే వైఖానస సరస్సు ఒడ్డున ప్రారంభమైందని రాంభట్ల ప్రతిపాదించారని వివరించారు. మన రామాయణ భారతాలు భారత ప్రాంతానికి పరిమితమైన కథలు కావని రాంభట్ల అనేక శాస్త్రీయ ప్రతిపాదనలు చేశారన్నారు. రాంభట్ల కృష్ణమూర్తి శాస్త్రీయమైన ఆలోచనలను తమ పరిశోధనల ద్వారా మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత పండితలోకానికి వుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రముఖ పాత్రికేయులు తాడి ప్రకాశ్ మాట్లాడుతూ, రాంభట్ల తెలుగు సరళంగా సుబోధకంగా వుంటుందన్నారు. నడిచే విజ్ఞాన సరస్వంగా భాసిల్లిన రాంభట్ల సాహిత్య కృషి గురించి పూర్తిస్థాయి పరిశోధనలు జరగాలన్నారు. కీర్తి ప్రతిష్ఠలు, ప్రతిఫలాలు ఆశించకుండా కేవలం తమకు నచ్చిన పని చిత్తశుద్ధితో చేసుకువెళ్లిన తరానికి రాంభట్ల ప్రతినిధి అన్నారు. గురజాల మాల్యాద్రి మాట్లాడుతూ, ఆశయం, కృషి వుంటే చదువుతో సంబంధం లేకుండా ఉన్నత విజయాలు సాధించడం సాధ్యమేనని రాంభట్ల నిరూపించాడన్నారు. 'అరసం' ప్రచురించిన రాంభట్ల స్మృతి సంచికను వేదికపై ఆవిష్కరించారు.

ఆది నుంచీ అంతే!

(5వ పేజీ తరువాయి)

విషయంలో అదేస్థాయిలో వ్యవహరించలేదన్న ఆరోపణలు ఉన్నాయి. 2022 ఆగస్టు 15న రాజ్‌భవన్‌లో జరిగిన ఎట్‌హోం కార్యక్రమానికి నానిని చంద్రబాబు స్వయంగా తన కారులో తీసుకుని వెళ్లి, తీసుకొచ్చారు. చంద్రబాబు జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత 2023 డిసెంబరు 6న దుర్గగుడికి వచ్చారు. ఆ సమయంలో అమ్మవారి దర్శనానికి చంద్రబాబు అంతరాలయంలోకి వెళ్లగా నాని బయటే ఉండిపోయారు. ఇది గమనించిన చంద్రబాబు నానిని పిలవాలంటూ తన సిబ్బందిని ఆదేశించారు. వారు వచ్చి పిలిచినా నాని లోపలికి వెళ్లేందుకు సుముఖత చూపలేదు. చివరికి దేవినేని ఉమా వచ్చి పిలిచినా ఆయనతోనూ దురుసుగా వ్యవహరించారే తప్ప లోపలికి వెళ్లలేదు. అధినేత తీరు ఇలా ఉంటే.. నాని తీరు మాత్రం అధినేత విషయంలో భిన్నంగా ఉండేది.

● నేతపై విసుర్లు

2022ఆగస్టులో చంద్రబాబు ఢిల్లీకి వెళ్లారు. ఆ సమయంలో ఎంపీలు గల్లా జయదేవ్, కింజారపు రామ్మోహన్ నాయుడు, నాని ఆయనకు స్వాగతం పలికేందుకు విమానాశ్రయానికి వచ్చారు. అధినేతకు ఇవ్వాలంటూ జయదేవ్ పుష్పగుచ్ఛాన్ని నానికి ఇవ్వగా ఆయన దాన్ని విసురుగా పక్కకు తోసేశారు. దీంతో గల్లా జయదేవ్ తానే పుష్పగుచ్ఛాన్ని అధినేతకు ఇచ్చారు. ఈ వీడియోను వైసీపీ శ్రేణులు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా ప్రచారం చేశాయి. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల తర్వాత తన పార్టీ కార్యాలయమైన కేశినేని భవన్‌లో చంద్రబాబు ఫొటోలను నాని తొలగించేశారు.

● ఇన్‌చార్జులన్నా చిన్నచూపే

విజయవాడ పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో టీడీపీ అధిష్ఠానం ఇన్‌చార్జులను నియమించింది. కానీ వీరికి ప్రత్యామ్నాయంగా నాని మెజారిటీ నియోజకవర్గాల్లో వేరే వ్యక్తులను ప్రోత్సహించడం ప్రారంభించారు. దీంతో పార్టీ శ్రేణుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. విజయవాడ పశ్చిమ, మైలవరం, తిరువూరు, నందిగామ నియోజకవర్గాల విషయంలో నాని ఉన్న ఇన్‌చార్జుల స్థానంలో వేరే వ్యక్తులను ప్రోత్సహిస్తూ వచ్చారు. ఈ పరిణామాలను పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోయాయి.

చలో విజయవాడ ఉద్రిక్తం

(5వ పేజీ తరువాయి)

తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకొంది. మహిళా పోలీసులు మహిళా ఉద్యోగులను ఎక్కడికక్కడ లాగేశారు. ఏటీఏ భవనం వద్ద ఉద్యోగులను పోలీసులు హాలులో కిందనే కూర్చోబెట్టి గేట్లు వేసి తీవ్ర నిర్బంధకాండను అమలుచేయడంతో ఉద్యోగులు పోలీసులతో వాగ్వాదానికి పాల్పడ్డారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఎస్పీడీ శ్రీనివాసరావు పిలుపు మేరకు ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, సంఘం గౌరవాధ్యక్షుడు ఏపీ నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు కాంతారావు ఆయన్ను కార్యాలయంలో కలిసి చర్చలు జరిపారు. ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని ఆయన హామీ ఇవ్వడంతో ఉద్యోగులు వెనక్కి తగ్గారు.

● సమ్మె చేస్తున్నా చలించరా?

నవంబరు 20న సమ్మె నోటీసు ఇచ్చి డిసెంబరు 20 నుంచి సమ్మె ప్రారంభించినా కనీసం తమతో చర్చలు జరిపి తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఆగ్రహించారు. సమ్మెలోని ఉద్యోగులను, ప్రత్యేకించి కేజీబీవీలలో పనిచేసే మహిళా ఉద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగిస్తామని భయభ్రాంతులకు గురిచేయడం, తిట్టడం, టెర్మినేట్ చేయడం వంటిచర్యలు అప్రజాస్వామికమని, చట్టవ్యతిరేకమని నినాదాలు చేశారు. ప్రభుత్వం వెంటనే బేషరతుగా కేజీబీవీల్లోని మహిళా ఉద్యోగులను, టెర్మినేట్ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఏలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతన విధానాన్ని అమలు చెయ్యాలని, అందరికీ మినిమం టైంస్కేల్, డీఏ అమలు చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.


హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న విజయలక్ష్మి

హస్తకళల కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా విజయలక్ష్మి

వన్‌టౌన్, జనవరి 5 : రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా బడిగించల విజయలక్ష్మి శుక్రవారం గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె తనకు బాధ్యతలు అప్పగించిన సీఎం వైఎస్ జగన్మోహన రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తాను త్వరలో రాష్ట్రమంతా పర్యటిస్తానని వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలను హస్తకళాకారులకు, చేనేత కళాకారులకు వివరించి తిరిగి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు బడిగించల చంద్రమౌళి, నాయకుడు మొలక వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

తంబి పుణ్యక్షేత్రంలో నవదిన ప్రార్థనలు


దివ్యబలిపూజను సమర్పిస్తున్న ఫాదర్ తాటికొండ జోసఫ్

ఉంగుటూరు, జనవరి 5 : పెదఅవుటపల్లిలోని సుప్రసిద్ధ కథోలికా పుణ్యక్షేత్రంలో బ్రదర్ జోసఫ్ తంబి వర్ధంతి మహోత్సవాలను పురస్కరించుకుని నవదిన ప్రార్థనలు రెండోరోజు కొనసాగాయి. శుక్రవారం సాయంత్రం 5.30గంటలకు బిషప్ తుమ్మాబాల స్కూల్ కరస్పాండెంట్(వరంగల్) రెవ.ఫాదర్ తాటికొండ జోసఫ్ దివ్యబలిపూజను సమర్పించారు. అనంతరం నిరీక్షణ క్రైస్తవ జీవితసత్యము అంశంపై సందేశమిచ్చారు. బ్రదర్ జోసఫ్ తంబి గొప్ప నిరీక్షణతో జీవించాడని ఆయన మార్గంలో ప్రతిఒక్కరూ పయనించాలని సూచించారు. ఈసందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో విచారణ గురువులు గోపు ప్రవీణ్, గోపు అభిలాష్, కచ్చా కిషోర్‌కుమార్, గుడిపెద్దలు, సంఘపెద్దలు, కన్యాస్త్రీలు, పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు, విశ్వాసులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జేడీ శీలం

బీజేపీకి బుద్ధి చెప్పేందుకు కూటమి సిద్ధం

» ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జేడీ శీలం

మచిలీపట్నం టౌన్, జనవరి 5 : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాట తప్పిందని, ఇందుకు ఇండియా కూటమి తగిన బుద్ధి చెబుతుందని కేంద్ర మాజీ మంత్రి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జేడీ శీలం అన్నారు. శుక్రవారం స్థానిక కళ్యాణ మండపంలో వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం జరిగింది. సమావేశంలో జేడీ శీలం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో సుస్థిరమైన ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అన్ని రాజకీయ పార్టీలు కలిసి పనిచేయాలన్నారు. రానున్న కాలంలో అన్ని నియోజకవర్గాల్లో చైతన్య సదస్సులు నిర్వహిస్తామన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు సీపీఐ, సీపీఎం, వివిధ ప్రజా సంఘాలు కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేయాలని కోరారు. పీసీసీ ఉపాధ్యక్షుడు కొరివి వినయకుమార్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, గిరిజన, క్రైస్తవ సంఘాల నాయకులు కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు గొల్లు కృష్ణ, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లాం తాంతియాకుమారి, సీపీఐ, సీపీఎం నాయకులు, ముస్లిం చైతన్య వేదిక నాయకులు తదితరులు మాట్లాడారు.

హామీలు అమలు చేయాల్సిందే

» రిలే నిరాహార దీక్షలో అంగన్వాడీలు

ధర్నాచౌక్, జనవరి 5 : కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీలు గత 24 రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా స్థానిక ధర్నాచౌక్‌లో రిలే నిరాహార దీక్షలు శుక్రవారం ప్రారంభించారు. ఆల్ ఇండియా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి ఏఆర్ సింధు దీక్షలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, అంగన్వాడీలు అడిగేది గతంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలనే అన్నారు. మోదీ, జగన్ ప్రభుత్వాలు ఎటువంటి అభివద్ధి చేయలేదని విమర్శించారు. ఏపీలో పిల్లలు పౌష్టికాహార లోపంతో ఎందుకు చనిపోతున్నారని ప్రశ్నించారు. గర్భిణులు, బాలింతలు అంగన్వాడీల మీద ఆధారపడ్డారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాడతామన్నారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఇఫ్టూ నేతలు వి.ఉమామహేశ్వరరావు, నర్సింగరావు, రవీంద్రనాథ్, జి.ఓబులేసు, ఎ.రవిచంద్ర పాల్గొని దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంగన్వాడీల ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అంగన్వాడీల సమస్యల పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలని అన్నారు. తక్షణమే స్పందించి వీరి న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


అంగన్వాడీలనుద్దేశించి ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఆర్ సింధు

పారిశుధ్య కార్మికుల భిక్షాటన



ఉయ్యూరు : కాంట్రాక్టు కార్మికులను అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో పర్మినెంట్‌చేసి సమానపనికి సమాన వేతనం చెల్లిస్తామని ఎన్నికల ముందు పాదయాత్రలో హామీఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఐదేళ్లు కావస్తున్నా హామీని తుంగలో తొక్కారని సీఐటీయూ నేత బి.రాజేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సమాన పనికి సమానవేతనం, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్‌చేస్తూ చేపట్టిన రాష్ట్ర వ్యాప్త సమ్మె శుక్రవారం 11వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఉయ్యూరులో పారిశుధ్య కార్మికులు జోలెపట్టి భిక్షాటన చేశారు. తమపట్ల ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరించడం బాధాకరమన్నారు. వర్కర్స్ యూనియన్ నాయకులు రామయ్య, చింతయ్య తదితరులు పాల్గొన్నారు.

దుర్మార్గపు, చేతగాని పాలనకు ముగింపు పలకాలి

» రా కదలిరా సభ ఏర్పాట్లలో టీడీపీ నేతలు

ఇబ్రహీంపట్నం/మైలవరం/రెడ్డిగూడెం, జనవరి 5 : రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి దుర్మార్గపు, చేతగాని పాలనకు ముగింపు పలకాల్సిన సమయం వచ్చిందని మాజీమంత్రులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, కొల్లు రవీంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావులు అన్నారు. ఈనెల 7న తిరువూరులో 'రా కదలిరా' భారీ బహిరంగ సభలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్న నేపథ్యంలో శుక్రవారం ఇబ్రహీంపట్నంలో సన్నాహక సమావేశంలో మంత్రులు పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు అక్రమ అరెస్టు తర్వాత ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో భారీ బహిరంగ సభ జరుగుతుందని, పెద్దఎత్తున నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. చంద్రబాబు కనిగిరి నుంచి శంఖారావం పూరించారని, ఐదు కోట్ల ఆంధ్రులు, జగన్మోహన్‌రెడ్డికి జరగబోతున్న ప్రజా పోరాటంలో టీడీపీ విజయం సాధిస్తుందన్నారు. 18న గుడివాడలో సభ ఉంటుందన్నారు. కార్యక్రమంలో దారు నాయక్, జంపాల సీతారామయ్య చెన్నుబోయిన చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.


సంఘీభావం తెలుపుతున్న టీడీపీ నేతలు

● మైలవరం, రెడ్డిగూడెంలలో ఉమా సన్నాహక సమావేశం నిర్వహించారు. మైలవరం నియోజకవర్గం నలుమూలల నుంచి సుమారు 40 వేలమంది తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో లంక లితీష్, ముప్పిడి నాగేశ్వర రెడ్డి, ఉయ్యూరు అంజిరెడ్డి, రాయుడు వెంకటేశ్వరరావు, జానలపాటి వేణుగోపాల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందిగామ : సైకో పాలనకు చరమగీతం పాడే కార్యక్రమంలో భాగంగా తిరువూరులో చంద్రబాబు సభకు ప్రజలు భారీగా తరలిరావాలని మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ కోరారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నివాసంలో ముఖ్యనేతలతో ఆయన సమావేశమయ్యారు.

నూరుశాతం అర్హులకు సంక్షేమ పథకాల లబ్ధి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, జనవరి 5 : నూటికి నూరుశాతం సంతృప్త స్థాయిలో అర్హత వున్న ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ధి అందాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు-ద్వైవార్షిక నగదు మంజూరు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. సంక్షేమ పథకాలకు అర్హత వుండి నిర్దీత సమయంలో దరఖాస్తు, బ్యాంకు ఖాతా వివరాలు తదితర కారణాల వల్ల నిలిచిపోయిన వారికి నవరత్నాలు-ద్వైవార్షిక నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా కలెక్టర్ ఢిల్లీరావు, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులతో హాజరయ్యారు. ఈసందర్భంగా పథకాల లబ్ధిదారులు, విద్యార్థులకు రూ.4.37 కోట్ల మెగా చెక్కును అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, అర్హత వుండి ఏ కారణంచేతనైనా లబ్ధి చేకూరకుండా వుంటే వెంటనే గ్రామ, వార్డు సచివాలయాలను సంప్రదించి దరఖాస్తు చేసుకొంటే లబ్ధి చేకూర్చడం జరుగుతుందన్నారు. ద్వైవార్షిక నగదు మంజూరు కింద జగనన్న అమ్మఒడి, వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ వాహనమిత్ర తదితర పథకాలకు సంబంధించి 2,934 మంది లబ్ధిదారులకు రూ.4.37 కోట్ల మేర లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ వివరించారు.


లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

జన్‌మన్‌తో గిరిజనుల జీవితాలకు భరోసా

కృష్ణలంక : గిరిజన ఉప వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన ప్రధానమంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్‌మన్) పథకాన్ని జిల్లాలో పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. కలెక్టర్ ఢిల్లీరావు, గిరిజన సంక్షేమ అధికారి జె.సునీతతో కలిసి మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారులతో శుక్రవారం వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 11 గిరిజన వర్గాల (పీవీటీజీ) ప్రజలు, వారి స్థితిగతులకు సంబంధించి ఎంపీడీవోలు సమగ్ర సమాచారంతో నివేదికలు అందించాలన్నారు. సొంతిల్లు, స్వచ్ఛమైన తాగునీరు, పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం, పోషణ, టెలికం అనుసంధానం తదితర ముఖ్యమైన సేవలు అందుబాటులో వుండేలా చూడాలని స్పష్టం చేశారు.

బ్యాంకు సిబ్బంది వేధింపులు.. వ్యక్తి ఆత్మహత్య

మైలవరం రూరల్, జనవరి 5 : తీసుకున్న అప్పు చెల్లించాలంటూ ప్రయివేటు బ్యాంక్ సిబ్బంది ఒత్తిడి చేయడంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గణపవరంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. గణపవరానికి చెందిన దొప్పల హరిబాబు (45) మరి కొందరు గ్రూపుగా ఏర్పడి కీర్తన అనే బ్యాంక్‌లో రూ.50 వేల చొప్పున రుణం తీసుకున్నారు. రెండు నెలలుగా హరిబాబు రుణం చెల్లించకపోవడంతో శుక్రవారం రాత్రి బ్యాంకు సిబ్బంది ఇంటికి వచ్చి హరిబాబును దుర్భాషలాడారు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో దూలానికి ఉరి వేసుకున్నాడు. స్థానికులు బ్యాంకు సిబ్బందిని వెంబడించి వారి వాహనం స్వాధీనం చేసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఎస్సై హరిప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బ్యాంకు సిబ్బంది ఒత్తిడి మేరకే హరిబాబు ఆత్మహత్య చేసుకున్నట్టు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

బాలికపై అసభ్యప్రవర్తన

» ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

» ఆలస్యంగా వెలుగులోకి ఘటన

కోడూరు, జనవరి 5 : విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడే చదువుకునేందుకు వచ్చిన బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన ఘటన కోడూరు మండలం ఉల్లిపాలెం గ్రామంలో వెలుగుచూసింది. ఎస్ఐ వి.రాజేంద్ర ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. ఉల్లిపాలెం ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న బాలిక ఈనెల 3న పాఠశాలకు వెళ్లగా, ఉపాధ్యాయుడు సుబ్బారావు బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో బాలిక విషయాన్ని ఇంటికి వెళ్లి తల్లికి చెపింది. దీంతో గ్రామానికి చెందిన పలువురు మహిళలు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడిపై దాడిచేశారు. సదరు ఉపాధ్యాయుడు స్థానిక ఎమ్మెల్యేకు సమీప బంధువు కావటం, బాలిక పెదనాన్న కూడా వైసీపీ గ్రామస్థాయి నేత కావటంతో విషయం బయటకు పొక్కకుండా రాజీ చేసినట్టు తెలుస్తోంది.

సామాజిక మాధ్యమాల్లో వైరల్.. కేసు నమోదు

బాలికపై ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించిన విషయం సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో విద్యాశాఖ విచారణ ప్రారంభించింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయగా, అవనిగడ్డ సీఐ ఎల్.రమేష్ విచారణ ప్రారంభించారు. ఎంఈవో రామదాసు శుక్రవారం పాఠశాలలోనూ, సదరు బాలిక బంధువులను, సహచర విద్యార్థులను వివరాలు అడిగి విద్యాశాఖకు నివేదిక అందజేసినట్టు సమాచారం.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	92, 100, 111
చికెన్ విత్ స్కిన్	178
చికెన్ స్కిన్‌లెస్	188
నెక్ కోడిగుడ్డు ధర	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.85	



జనసేనతో అన్ని వర్గాలకు సముచిత స్థానం

ఉయ్యూరు, జనవరి 5 : జనసేనలో అన్ని వర్గాలకు సముచిత స్థానం లభిస్తుందని పార్టీ పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. జనసేన ఉయ్యూరు మండల అధ్యక్షుడు జరుగు ఆదినా రాయణ, సీనియర్ నాయకుడు బొప్పన శివప్రసాద్ ఆధ్వర్యంలో ఉయ్యూరుకు చెందిన కార్తికేయ ఫౌండేషన్ ప్రతినిధి హుండీ కార్తికేయ, చినఓగిరాల పీఏసీఎస్ మాజీ ఛైర్‌పర్సన్ క్రాపా సీతారామయ్య ఇటీవల జనసేనలో చేరగా మనోహర్ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం అరాచక, అవినీతి, చేతకాని పాలనను ఎండగట్టి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

బడుగులంటే అలుసా?

- ●పార్టీ నుంచి వెళ్లగొట్టడానికి జగన్‌కు బీసీ, ఎస్సీ, ఎస్టీలే దొరికారా?
- ●పోరంకిలో జరిగిన 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ'లో మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, జనవరి 5 : ఓడిపోతారన్న ముద్రవేసి పార్టీ నుంచి వెళ్లగొట్టడానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలే జగన్‌కు దొరికారా? బడుగు వర్గాల ఎమ్మెల్యేలంటే జగన్‌కి అలుసు అని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. శుక్రవారం పోరంకిలో జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన పాల్గొని ప్రజలతో మాట్లాడారు. ఎన్నికల ముందు నా బీసీ, నా ఎస్సీ, నా ఎస్టీ అంటూ జగన్ మాట్లాడే మాటలు నీటిమూటలేనా అని ఎద్దేవా చేశారు. ఒక పక్క సొంత పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర పార్టీల్లోకి తొంగి చూడడం, మరో పక్క తల్లి, చెలి కాంగ్రెస్‌లో చేరి తన తోనే పోటీకి దిగుతుండడంతో దిక్కుతోచని జగన్ రెడ్డికి నోట్లో వెలక్కాయ పడినట్లుందని పేర్కొన్నారు. బోడె వెంట అనుమోలు ప్రభాకరరావు, సంగెపు రంగారావు, బోడె సురేంద్ర, దేవినేని రాజా, యాళ్ల చక్రవర్తి, ముక్కామల నాని, షేక్ సలీం, రావి రాకేష్, వంగూరు పవన్ ఉన్నారు.

బోడె హేమ ఆధ్వర్యంలో..

తాడిగడప రాంనగర్‌లో జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో బోడె ప్రసాద్ సతీమణి హేమ నేతృత్వంలోని స్థానిక టీడీపీ మహిళా నేతలు మేడసాని రత్నకుమారి, రేఖ, నాగమణి, కనకదుర్గ, ప్రమీల, తుమ్మల రాంకుమార్, పీతా గోపీచంద్, రాజబాబు, నాగుల్‌మీరా, వెంకటేశ్వరరావు, పామర్తి సిద్ధయ్య, కిలారు రవివర్మ, ముక్కపాటి దామోదర్, కందుల ప్రసాద్ స్థానికులతో మాట్లాడి వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బోడె ప్రసాద్‌ను, ముఖ్యమంత్రిగా చంద్రబాబును ఎన్నుకోవాలని కోరారు.

కానూరులో..

లోటు బడ్జెట్‌తో చేతికొచ్చిన ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపిన చంద్రబాబు తయారీ నవ్యాంధ్రను ఉద్యమాంధ్రగా మార్చిన ఘనత సైకో జగన్‌రెడ్డిదేనని టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకర బాబు, టీడీపీ నేతలు దేవినేని గౌతమ్, స్మిత దంపతులు పేర్కొన్నారు. శుక్రవారం కానూరులో వేర్వేరు చోట్ల జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాల్లో వారు పాల్గొని ప్రజలతో మాట్లాడారు. అన్ని వర్గాలకు హామీలిచ్చి గద్దెనెక్కి తీరా వంచించడంతో ప్రతి వర్గం నేడు సమ్మెల బాటలో ప్రయాణిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయులు, ఉద్యోగులు, అంగన్‌వాడీలు, మునిసిపల్ కార్మికులు, సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల వారు సమ్మె పేరుతో రోడ్డెక్కడం ఏ రాష్ట్రంలోనైనా చూశామా అని ప్రశ్నించారు. అభివృద్ధి పథంలో నడిపిస్తున్న చంద్రబాబును కాదని జగన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసినందుకు ప్రజలు అన్ని జిల్లాల్లో పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసి తిరిగి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపు నిచ్చారు. వారి వెంట స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



పోరంకిలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న బోడె ప్రసాద్, ఇతర నాయకులు



కానూరులో వెలగపూడి శంకరబాబు తదితరులు

వైసీపీని సాగనంపడం ఖాయం

చినఓగిరాల(ఉయ్యూరు) : విద్యుత్, బస్సు చార్జీల పెంపు, నిత్యావసరాల ధరల పెరుగుదలతో సామన్య మధ్య తరగతి ప్రజల నడ్డివిరిచిన వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ కొండా ప్రవీణ్ అన్నారు. చినఓగిరాలలో శుక్రవారం బాబూ ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ, జనసేన అధికారంలోకి వచ్చిన తరువాత అమలయ్యే సంక్షేమ, అభివృద్ధి పథకాలు తెలియజేశారు. బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సంగేపు రంగారావు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గోలి వసంతకుమార్, సాయిపురం, జబర్లపూడి సర్పంచ్‌లు జాన్‌బాషా, సూరపనేని ప్రసాద్, ఆరేపల్లి వెంకటేశ్వరరావు, బండెల గణేశ్, రామకృష్ణ, సజ్జా మధు పాల్గొన్నారు.



చినఓగిరాలలో టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

మద్యం అక్రమ విక్రేత అరెస్టు

హనుమాన్‌జంక్షన్, జనవరి 5 : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని శుక్రవారం ఎస్సై జనార్దన్ అరెస్టు చేశారు. పీఎస్ పరిధిలోని బిళ్లనపల్లి లో ఆ గ్రామానికి చెందిన గోవాడ ఏసోబు తన నివాసంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి తొమ్మిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

జోసఫ్ తంబి ఉత్సవాలకు
13న రానున్న కలెక్టర్

ఉంగుటూరు, జనవరి 5 : పెదఅవుటపల్లిలోని బ్రదర్ జోసఫ్ తంబి వర్థంతి మహోత్సవాలను విజయవంతం చేయటంలో సహకారాన్నందించాలంటూ తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్ నేతృత్వంలో గురువులు, గుడిపెద్దలు వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఉన్నతాధికారులను కలిసి ఉత్సవాలకు సాదరంగా ఆహ్వానిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం కలెక్టర్ పి.రాజాబాబును ఫాదర్ పాలడుగు జోసఫ్, విచారణ గురువులు ఫాదర్ గోపు అభిలాష్‌లు మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవ ఆహ్వానపత్రాన్ని ఆయనకు అందజేశారు. అనంతరం ఈ నెల 13న ఉదయం తంబి తిరునాళ్లకు హాజరుకానున్నట్లు తెలిపారని క్షేత్రం రెక్టర్ పాలడుగు జోసఫ్ మీడియాకు వెల్లడించారు.

షర్మిలతో కాంగ్రెస్‌కు జీవం

హనుమాన్‌జంక్షన్, జనవరి 5 : వైఎస్ షర్మిల రాకతో కాంగ్రెస్‌కు జీవం వచ్చినట్లేనని, సరైన సమయంలో మంచి నిర్ణయం తీసుకొని కాంగ్రెస్ పార్టీలో చేరడం అభినందనీయమని కృష్ణాజిల్లా డీసీసీ అధ్యక్షుడు వింత సంజీవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిరకాల వాంఛగా మిగిలిపోయిందని దానిని తీర్చడానికి వైఎస్సార్ షర్మిలా రూపంలో మరలా వచ్చారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రెండు నుంచి మూడు ఎంపీ స్థానాలు, 10 నుంచి 15 ఎమ్మెల్యే స్థానాలు సాధించడం ఖాయమని పేర్కొన్నారు.

విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలి

ఉంగుటూరు, జనవరి 5 : విద్యార్థులు చదువుతోపాటు వివిధ రంగాల్లో రాణించటానికి అవసరమైన ప్రతిభా పాటవాలు, సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు యువర్ ఫెస్ట్ వంటి ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయని ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్(ఏపీఎస్‌సీహెచ్‌ఈ)ప్రొఫెసర్ కె.రామ్మోహనరావు అన్నారు. తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్-2024 వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. టెక్ మహీంద్ర ప్రతినిధి కె.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ, టెక్నికల్ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, డైరెక్టర్ కె.రాజశేఖరరావు మాట్లాడుతూ, టెక్నికల్ క్విజ్, పేపర్ ప్రజెంటేషన్, జెట్‌రాకెట్స్, టెక్నికల్ జామ్, టెక్నోథాన్ వంటి అంశాల్లో వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థుల మధ్య స్నేహపూరిత వాతావరణంలో పోటీలు నిర్వహించటంద్వారా వారి ఆలోచనల్లో సమన్వయం ఏర్పడి పరస్పరం సహకరించుకునే దృక్పథం పెంపొందుతుందన్నారు. కళాశాల ఛైర్మన్ సుంకర రామబ్రహ్మం, వైస్ ప్రెసిడెంట్ లంకా అరుణ్ పాల్గొన్నారు.

డప్పు కార్మికులను ఆదుకోవాలి

ఉంగుటూరు, జనవరి 5 : చర్మ, డప్పు కార్మికులను ఆదుకోవాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆధ్వర్యంలో మండలంలోని చర్మ, డప్పు కార్మికులు శుక్రవారం మండల కార్యాలయాల ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళీ మాదిగ మాట్లాడుతూ, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతోపాటు చర్మ, డప్పుకార్మికుల జీవనం దుర్భరంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చే మూడు వేల పెన్షన్‌ను ఫిబ్రవరి నుంచి ఐదు వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ డి.వనజాక్షికి, ఈవోపీఆర్డీ ఎం.అమీర్ బాషాకి వినతిపత్రాలు అందజేశారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం



వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యుల బృందంతో నవోదయ ప్రిన్సిపాల్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 5 : విద్యార్థి దశ నుంచే శారీరక శుభ్రత పాటిస్తూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు సూచించారు. వేలేరు జవహర్ నవోదయ విద్యాలయంలో పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలకు చెందిన వైద్యులు శుక్రవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. నవోదయలోని 430 మంది విద్యార్థులకు డెంటల్, కళ్లు, డెర్మటాలజీ తదితర విభాగాలకు చెందిన వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ప్రతి రోజు శారీరక శుభ్రత తప్పనిసరిగా పాటిస్తూ రెండుసార్లు బ్రెషింగ్ చేస్తూ నోటిని శుభ్రపరచుకోవాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలకు చెందిన వివిధ విభాగాల వైద్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలు

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ యరగొర్ల నగేష్ తెలిపారు. వేలేరులో శుక్రవారం సురక్ష ఫేజ్ -2లో భాగంగా ప్రజలకు పీహెచ్‌సీ వైద్యాధికారి మంజూష ఆధ్వర్యంలో 526 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుందరమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీడీఓ జోగేశ్వరరావు, నక్కా గాంధీ, అవిర్నేని శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

రాగూర్ గ్రంథాలయంలో మెగా వైద్యశిబిరం నేడు

గవర్నర్‌పేట, జనవరి 5: ఎంజీ రోడ్డులోని రాగూర్ స్మారక గ్రంథాలయంలో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం జరుగుతుందని, లైబ్రరీ ఉద్యోగులు, పాఠకులు, ఇతరులు వైద్య సేవల్ని వినియోగించుకోవాలని రాగూర్ గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య శిబిరంలో కంటి పరీక్షలు, దంత పరీక్షలు, చెవుల వినికిడి టెస్టింగ్, బీపీ, ఆర్‌బీఎస్, ఆర్థోపెడిక్, జనరల్ వైద్య పరీక్షలు, సలహా, సూచనలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ టి. జమల పూర్ణమ్మ శిబిరాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

గ్రూప్-2 పరీక్షలపై అవగాహన



తన రచనలను విద్యార్థులకు అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

పటమట, జనవరి 5 : సర్వోత్తమ గ్రంథాలయం ఆధ్వర్యాన శుక్రవారం గ్రూప్-2 పరీక్షలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ప్రతిరోజు అన్ని దినపత్రికలలో కరెంట్ అఫైర్‌లను పరిశీలించాలని, కఠోర శ్రమతో సాధన చేస్తే విజయాన్ని సాధిస్తారని తెలిపారు. గ్రూప్-2 సిలబస్, ప్రశ్నల సరళితో పాటు గతంలో జరిగిన పరీక్ష పేపర్లను అవగాహన చేసుకుని నోట్స్ తయారు చేసుకోవాలని సూచించారు. పలువురు అభ్యర్థులు ఆయనను అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. గ్రంథాలయ కార్యదర్శి రావి శారద అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హాజరైన అభ్యర్థులకు కేఎస్. లక్ష్మణరావు రచించిన భారత సమాజం, ఆంధ్రుల చరిత్ర-ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ పుస్తకాలను ఉచితంగా అందజేశారు.

యథేచ్ఛగా జూదాలు!

- ● అధికార పార్టీ అండతో జోరుగా పేకాట, కోడిపందేలు
- ● చేతులు మారుతున్న నోట్ల కట్టలు ● పట్టించుకోని పోలీసులు

ఉయ్యూరు, జనవరి 5 : ఉయ్యూరు మండల పరిధి గ్రామాల్లో కోడిపందేలు, పేకాటలతో సంక్రాంతి ముందే వచ్చినట్టు కన్పిస్తుంది. కొద్ది రోజులుగా పెద ఓగిరాల, ఆకునూరుతో పాటు పలు గ్రామాల్లో అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలో యథేచ్ఛగా కోడిపందేలు, పేకాట పెద్దఎత్తున జరుగుతున్నా పోలీసులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. పెద ఓగిరాలలో అధికార పార్టీ స్థానిక ప్రజాప్రతినిధి ఆధ్వర్యాన కోడి పందేలు, పేకాట జోరుగా నడుస్తున్నా పోలీసులు కన్నెత్తి చూడకపోవడం విశేషం. పెద ఓగిరాలతోపాటు, తోట్లవల్లూరు, కంకిపాడు మండలాల గ్రామాల సరిహద్దుల్లో ఆదివారాలు పెద్దఎత్తున్న కోడిపందేలు నిర్వహిస్తున్నా పోలీసులు పట్టనట్టు వ్యహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా సంక్రాంతికి భారీగా కోడి పందేలు, పేకాట వేసేందుకు అధికార పార్టీ నాయ కుల అండతో చోటా మోటా నాయకులు రంగం ముందే సిద్ధం చేస్తున్నట్టు, పందేంరాయుళ్లకు సమాచారం ఇచ్చినట్టు తెలియవచ్చింది. ఈ మేరకు పోలీసులకు కూడా పెద్దమొత్తంలో ముడుపులు చెల్లించేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. కాగా ఇటీవల బోళ్లపాడులో కోడిపందేలపై కంకిపాడు సీఐ సిబ్బందితో దాడిచేసి పందేలు వేస్తున్న కొందరిని అరెస్టు చేసి పెద్ద మొత్తంలో నగదు, జాతి కోడిపుంజులు స్వాధీన పరుచుకున్నప్పటికి తిరిగి పందేలు యథేచ్ఛగా కొనసాగించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి

ఎస్సీ, ఎస్టీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎలియా



కంకిపాడు కమిటీ అధ్యక్షుడు ప్రతాప్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఇంటూరి ఎలియా

కంకిపాడు, జనవరి 5 : అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నానని, తనతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు కలిసి రావాలని ఎస్సీ, ఎస్టీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇంటూరి ఏలియ అన్నారు. కంకిపాడులో శుక్రవారం మండల కమిటీని ఆయన ఏకగ్రీవంగా ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఏ ఒక్కరూ ముందుకు రావడం లేదన్నారు. ఎన్నికల సమయంలో ఓటు బ్యాంకుగా మాత్రమే ఈ వర్గాలను పరిగణిస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో అన్ని పార్టీల వారు తమకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుంభ ప్రభుదాస్, ఉయ్యాల ఏడుకొండలు పాల్గొన్నారు. కంకిపాడు మండల కమిటీ అధ్యక్షుడిగా లాం ప్రతాప్, ఉపాధ్యక్షుడిగా టెక్కెం శేషుబాబు, జగన్నాధ శ్రీనివాసరావు, కూలేడి చిట్టిబాబు, గరికె వెంకటేశ్వరరావులను నియమించి, నియామకపత్రాలను అందజేశారు.

జలధీశ్వరస్వామి సేవలో యార్లగడ్డ

ఘంటసాల : బాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామిని టీడీపీ గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు కుటుంబసమేతంగా శుక్రవారం ఆయన దర్శించుకున్నారు. అర్చకులు చావలి కృష్ణకిషోర్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాముఖ్యతను జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ తెలియజేశారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ వేమూరి వెంకట్రావు, కొడాలి ఏఎంసీ మాజీ ఛైర్మన్ తుమ్మల చౌదరిబాబు, గ్రామ ఉపసర్పంచ్ భానుప్రకాష్, బండి పరాత్పరరావు, వేమూరి సాయి వెంకటరమణ పాల్గొన్నారు.

బీసీల గురించి మాట్లాడే నైతికత
కృష్ణయ్యకు లేదు: టీడీపీ బీసీ నేతలు

పెనమలూరు, జనవరి 5 : బీసీల గురించి, వారి అభ్యున్నతి గురించి మాట్లాడే నైతికత కృష్ణయ్యకు లేదని నియోజకవర్గ టీడీపీ బీసీ నాయకులు పీతా గోపీచంద్, సంగెపు రంగారావు, శొంఠి శివరాం ప్రసాద్ విమర్శించారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ, గురువారం జరిగిన వైసీపీ బీసీ సమావేశంలో ఆర్ కృష్ణయ్య బీసీల బతుకులు మారాయని పలికిన ప్రగల్భాలను తీవ్రంగా ఖండించారు. వేదిక మీదున్న కృష్ణయ్య రాజ్యసభ్యుడయ్యి, అతను మాత్రమే బాగుపడితే బీసీలు బాగుపడినట్లా అని నిలదీశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చినటప్పటి నుంచి పనులు లేక బీసీలు అల్లాడుతుంటే నీకు కనిపించలేదా అని ప్రశ్నించారు. బీసీలను వందల మందిని నడిరోడ్లపై వైసీపీ గూండాలు హత్యలు చేస్తుంటే నీకు కనిపించలేదా అని ప్రశ్నించారు. బీసీల న్యాయమయిన హక్కుల కోసం తాము పోరాడుతుంటే నిధులు, విధులు లేని కార్పొరేషన్లు ఇచ్చామనడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. బీసీల బతుకులను జగన్ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టిన కృష్ణయ్యకు చంద్రబాబును విమర్శించే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు కొణతం సుబ్రహ్మణ్యం, బొర్రా వెంకట్, వణుకూరు విక్రమ్, బలగం నాగరాజు, తమ్ము అశోక్, జన్ను నాగరాజు, వీరంకి కుటుంబరావు, ఆరేపల్లి వెంకటేశ్వరరావు, మాదు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వెంకమ్మ పేరంటాలమ్మ
హుండీ ఆదాయం రూ.4.34 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

గుణదల, జనవరి 5 : రామవరప్పాడు వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో హుండీల ద్వారా రూ. 4.34లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో పాతూరి లోకేశ్వరి తెలిపారు. గడచిన 48 రోజులుగా భక్తులు హుండీల్లో వేసిన నగదు లెక్కింపు కార్యక్రమం ఆలయ ప్రాంగణంలో శుక్రవారం జరిగింది. పాలక మండలి సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. హుండీల్లో నగదు రూపంలో మినహా బంగారు, వెండి ఆభరణాలు ఏమీ రాలేదని హుండీ లెక్కింపు పర్యవేక్షణ అధికారిణిగా వ్యవహరించిన దేవాదాయశాఖ విజయవాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ కె.వి.అనురాధ తెలిపారు. అమ్మవారి మొక్కుబడులు భక్తులు హుండీల్లో మాత్రమే సమర్పించుకోవాలని కోరారు.

అన్న సంతర్పణకు రూ. 1.70 లక్షల విరాళం

సంక్రాంతిని పురస్కరించుకుని రామవరప్పాడులో నిర్వహించనున్న వెంకమ్మ పేరంటాలమ్మ జాతర అనంతరం నిర్వహించే అన్న సంతర్పణకు డిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత పరిమి నరేంద్రబాబు రూ. 1.70 లక్షల విరాళం చెక్కును శుక్రవారం అందజేశారని ఆలయ ఈవో పాతూరి లోకేశ్వరి తెలిపారు. ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు వెంకమ్మ పేరంటాలమ్మ జాతర జరగనున్న విషయం తెలిసిందే. 14న సాయంత్రం నుంచి 18 తేదీ రాత్రి వరకు రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లోకి అమ్మవారిని గ్రామోత్సవానికి తీసుకెళ్లనున్నట్లు ఈవో తెలిపారు. 20న ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	92, 100, 111
చికెన్ విత్ స్కిన్	178
చికెన్ స్కిన్‌లెస్	188

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.85

కొండాలమ్మ సేవలో జేసీ గీతాంజలి శర్మ



గుడ్లవల్లేరు, జనవరి 5 : వేమవరం కొండాలమ్మను జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన గీతాంజలి శర్మ శుక్రవారం దర్శించుకొన్నారు. బదిలీపై వెళ్తున్న అపరాజితా సింగ్‌తో కలసి గీతాంజలి శర్మ ఆలయానికి వచ్చి అమ్మ వారికి పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వారి రువురినీ సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. గుడివాడ ఆర్డీవో పద్మావతి, గుడ్లవల్లేరు తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ మస్తానా పాల్గొన్నారు.



హుండీ కానుకల లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో చక్రధరరావు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి.1.03 కోట్ల ఆదాయం

మోపిదేవి, జనవరి 5 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి హుండీ ఆదాయం రూ.1.03,84,725 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.ఎస్.చక్రధరరావు తెలియజేశారు. దేవదాయశాఖాధికారుల పర్యవేక్షణలో హుండీల కానుకలను లెక్కింగా 98 రోజులకు రూ.1,03,83,725 నగదు, వెండి 4 కేజీల 700 గ్రాములు, బంగారం 90 గ్రాములు, అమెరికా డాలర్లు 219, అరబ్ దిరామ్స్ 10, ఆస్ట్రేలియా డాలర్స్ 10, సింగపూర్ డాలర్స్ 14, ఇంగ్లాండ్ పౌండ్లు 15, శ్రీలంక రూ.240 ఆదాయంగా వచ్చినట్లు తెలిపారు. ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్, గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి సిహెచ్.సుధాకర్‌రావు, వివిధ దేవాలయాల ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.



కృష్ణా వర్సిటీలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

విద్యార్థులు సేవాభావం పెంపొందించుకోవాలి

మచిలీపట్నం టౌన్, జనవరి 5 : విద్యార్థులు సేవాదృక్పథం పెంపొందించుకోవాలని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. కృష్ణావిశ్వవిద్యాలయంలో శుక్రవారం ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్ విభాగాల ఆధ్వర్యంలో వలంటీర్ల నమోదు కలెక్టర్ అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రెడ్‌క్రాస్ నిర్వహించే సేవాకార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.కె.ఫరీదా మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు, ఆపదలో ఉన్న ప్రజలను విద్యార్థులు ఆదుకోవాలన్నారు. వర్సిటీ ఉపకులపతి జ్ఞానమణి మాట్లాడుతూ, రెడ్‌క్రాస్ సభ్యత్వం తీసుకోవడం ఒక అదృష్టమన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.వీరబ్రహ్మచారి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ విజయకుమారి, ఎన్‌సీసీ విభాగ అధిపతి డాక్టర్ రామశేఖరరెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ తోట బాలాజీ, కార్యదర్శి శంకరనాథ్ రెడ్‌క్రాస్ ప్రతినిధి బి.వి.ఎస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేడీసీసీబీ గుడ్లవల్లేరు బ్రాంచి భవనం ప్రారంభం



గుడ్లవల్లేరు : కేడీసీసీ బ్యాంకు గుడ్లవల్లేరు బ్రాంచి నూతన భవనాన్ని జడ్పీ చైర్‌పర్సన్ హారిక, ఎమ్మెల్యే కొడాలి నాని శుక్రవారం ప్రారంభించారు. బ్యాంక్ కార్యాలయాన్ని కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి ప్రారంభించారు. కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్‌లు పడమటి సుజాత, భూక్యా రాణి, పెద వెంకయ్య, కృష్ణారావు, రాణా,రవి శంకర్, ఎంపీపీ కొడాలి సురేష్, కె.డి.సి.సి సి.ఇ.ఓ శ్యామ్ మనోహర్, గుడ్లవల్లేరు శాఖ మేనేజర్ మల్లేశ్వరి , పెన్నేరు ప్రభాకరరావు, బ్రాంచ్ పరిధిలోని సొసైటీ అధ్యక్షులు, సిఇఓ లు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం పనులకు శంకుస్థాపన

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులో జగనన్న హౌసింగ్ కాలనీలో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.1.64 కోట్లతో రక్షిత మంచినీటి సరఫరా పథకం, ఇంటింటికీ కుళాయి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కొడవాలి నాని శుక్రవారం జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలిసి శంకుస్థాపన చేశారు.



గుడివాడలో పొర్లుదండాలు పెడుతున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికులు పొర్లు దండాలతో వినూత్న నిరసన

గుడివాడ : మున్సిపల్ కార్మికుల సమ్మె శుక్రవారంతో 11వ రోజుకు చేరకుంది. కార్మికులు పొర్లు దండాలు పెడుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. డిమాండ్‌లను పరిష్కరించకుంటే 8వ తేదీన కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని కార్మికులు హెచ్చరించారు.



సింగలూరులో టీడీపీ వలన జరిగే మేలును వివరిస్తున్న వెనిగండ్ల, రావి



అవనిగడ్డ ఏడో వార్డులో బాబు ష్యూరిటీ కరపత్రాలు అందజేస్తున్న వెంకట్రామ్



రామానుజవత్తర్లపల్లిలో కరపత్రాలు అందజేస్తున్న కాగిత కృష్ణప్రసాద్

చంద్రబాబు వస్తేనే రాష్ట్రం బాగుపడేది

బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు, జనవరి 5 : చంద్రబాబు పాలనతోనే రాష్ట్ర పురోగతి సాధ్యమని గుడివాడ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము అన్నారు. అంగలూరు, చంద్రాల, సింగలూరు గ్రామాల్లో బాబు ష్యూరిటీ - భవిషత్ గ్యారెంటీ కార్యక్రమాల్లో వెనిగండ్ల రాము పాల్గొని ఇంటింటీ తిరిగి కరపత్రాలను అందజేశారు. అంగలూరు కవిరాజు నగర్‌లో తాగునీటి సమస్యను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే బావి తవ్వించే పనులు ప్రారంభింపచేశారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, గుడివాడ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్‌పర్సన్ శాయిన పుష్పావతి, జనసైనికులు సందు పవన్, బుల్లా కింగ్, టీడీపీ నాయకులు ఈడే మోహన్, చాపరాల రాజేశ్వరరావు, లింగం చిట్టిబాబు, శ్యామలరాజు, ధనకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** అవనిగడ్డ నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో టీడీపీ - జనసేన జెండా ఎగురుతుందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ తెలిపారు. అవనిగడ్డ ఏడో వార్డులో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ౧ అధికారంలోకి వస్తేనే మళ్లీ రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాసం చిట్టిబాబు, కొల్లూరి వెంక టేశ్వరరావు, లుక్కా శ్రీను, షేక్ బాబావలి, బండే రాఘవ, బడే సుబ్బారావు, లుక్కా పిచ్చియ్య, దాసినేని శ్రీనివాసరావు, బండే నాగ వెంకట కనకదుర్గ, యాసం లంకమ్మ తదితరులు పాల్గొన్నారు. **కోడూరు :** మందపాకల గ్రామ శివారు పాదాలవారిపాలెం గ్రామంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు కరపత్రాలను పంపిణీ చేశారు. క్లస్టర్ ఇంచార్జ్ కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, చిమటూరి చంద్రశేఖర్, ఉల్లి శేషగిరి, జరుగు నారాయణ, పిల్లి మల్లిఖార్జునరావు, గోగినేని సోమశేఖరరావు, మల్లాది ప్రసాద్, బొడ్డు వెంకన్న, దోనేపూడి వరప్రసాద్, మహమ్మద్ ఇమ్రాన్, అద్దంకి రవి, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. **పామర్రు :** పామర్రు 16వ వార్డులో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్య క్రమంలో వర్ల కుమార్ రాజా పాల్గొని చంద్రబాబును సీఎంను చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. **చల్లపల్లి :** పురిటిగడ్డలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. టీడీపీ అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి మోర్ల శివ, ఎంపీటీసీ సభ్యుడు రాజులపాటి అంకమ్మ, యూనిట్ ఇన్‌చార్జి దేవభక్తుని గోపాలకృష్ణ, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కైతేపల్లి శ్రీనివాసరావు, దేవభక్తుని సుధీర్‌బాబు, రాజులపాటి జగదీష్, పులివర్తి పండు బాబు, మురాల రామశ్రీను, కొత్త శ్రీను పాల్గొన్నారు. **పెడన రూరల్ :** గూడూరు మండలం రామానుజవత్తర్లపల్లిలో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో పెడన నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కాగిత కృష్ణప్రసాద్, నియోజకవర్గ పరిశీలకులు సాదరబోయిన ఏడుకొండలు పాల్గొన్నారు. రానున్న ఎన్నికలలో టీడీపీని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రి చేసి రాష్ట్రాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పోతన స్వామి, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. **తోట్లవల్లూరు :** చాగంటిపాడు శివారు కళ్లంవారిపాలెంలో శుక్రవారం రాత్రి బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి, మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్ ప్రసాద్, కళ్లం కోటిరెడ్డి, కృష్ణారెడ్డి, శివశంకరరెడ్డి, వంశీ కృష్ణారెడ్డి, చింతపల్లి వెంకటేశ్వరరావు, వీ రంకి వరహాలరావు, మట్టా అమృతబాబు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ ఆశయ సాధనే లక్ష్యం

● మాదివాడ వెంకటకృష్ణ



జనసేన నేతల సంఘీభావం

అవనిగడ్డ, జనవరి 5 : పవన్ కల్యాణ్ ఆశయ సాధనే లక్ష్యమని జనసేన పార్టీలో చేరిన ప్రముఖ సంఘ సేవకుడు మాదివాడ వెంకటకృష్ణ అన్నారు. మాదివాడ వెంకట కృష్ణ జనసేన పార్టీలో చేరిన సందర్భాన్ని పురస్కరించుకుని పార్టీ శ్రేణులు అవనిగడ్డలో భారీ ర్యాలీని నిర్వహించాయి. బాలికల హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాదివాడ వెంకట కృష్ణ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆశయాలు నచ్చి జనసేనలో చేరినట్లు తెలిపారు. జనసేన పార్టీ ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ తోనే మార్పు సాధ్యమన్నారు. జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు అధ్యక్షత వహించగా, కోడూరు, అవనిగడ్డ, చల్లపల్లి మండల పార్టీల అధ్యక్షులు మర్రే గంగయ్య, గుడివాక శేషుబాబు, విమల్ కృష్ణ, నెరుసు కృష్ణాంజనేయులు, ఉస్మాన్ షరీఫ్, రాజనాల వీరబాబు, బాదర్ల లోలాక్షుడు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు. సీతా యిలంకలోని అంబేడ్కర్ విగ్రహానికి మాదివాడ వెంకట కృష్ణ, జనసైనికులు నివాళులర్పించారు.

చంద్రబాబు సభకు రైతులు తరలి రావాలి

మచిలీపట్నం టౌన్ : తిరువూరులో ఈనెల 7వ తేదీన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పాల్గొనే సభా కార్యక్రమాల్లో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. రైతు సంఘాల నాయకులు శుక్రవారం ఆయన్ను కలిశారు. గోపు సత్యనారాయణ మాట్లాడుతూ, టీడీపీ ఇన్‌చార్జి, పొలిట్ బ్యూరో సభ్యుడు బొండా ఉమా నాయకత్వంలో జరుగుతున్న సభలో రైతు సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు.

జగన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు : కొనకళ్ల

మచిలీపట్నం టౌన్ : వై.ఎస్. జగన్‌మోహనరెడ్డి పాలనకు విరక్తి చెందిన రాష్ట్ర ప్రజలు రానున్న ఎన్నికల్లో తిరుగుబాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీకి గుడ్‌బై చెప్పేందుకు రెడీగా ఉన్నారని మాజీ ఎంపీ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు అన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుతో మాట్లాడారు. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామా చేస్తున్నారన్నారు. వైసీపీకి సొంత పార్టీ వారే దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు.



బందరులో అంగన్వాడీల ధర్నా



పామర్రులో అంబేడ్కర్ విగ్రహం వద్ద..



బంటుమిల్లిలో పూలు పంచుతూ..

ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటాం : అంగన్వాడీలు

మచిలీపట్నం టౌన్ : ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకుంటామని, బెదిరింపులకు భయపడేది లేదని, సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామని అంగన్‌వాడీ కార్యకర్తలు ధ్వజమెత్తారు. మచిలీపట్నం .దర్నా చౌక్ వద్ద నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె 25వ రోజుకు చేరుకుంది. వినూత్న రీతిలో నిరసనలు తెలియజేశారు. రమాదేవి, రెజీనారాణి తదితరులు ఈ సమ్మెకు నాయకత్వం వహిస్తున్నారు. **గుడివాడ రూరల్ :** అంగన్వాడీలు 25 రోజులుగా సమ్మె చేస్తుంటే పట్టించుకోకపోవటం ప్రభుత్వానికి సిగ్గు చేటని అంగన్‌వాడీ వర్కర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీడీపీవో కార్యాలయం వద్ద పెద్ద సంఖ్యలో 500 మంది అంగన్వాడీ కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. **కూచిపూడి :** అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 25వ రోజుకు చేరుకుంది. మొవ్వ ఐసీడీఎస్ కార్యాలయంలో చేపట్టిన దీక్షలో మొవ్వ, చల్లపల్లి, ఘంటసాల మండలాలకు కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు. మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి భానుమతి అంగన్‌వాడీలతో చర్చించి విధుల్లోకి చేరవలసిందిగా కోరినప్పటికీ వారు తిరస్కరించారు. **బంటుమిల్లి :** అంగన్వాడీ కార్యకర్తలు సమ్మెలో భాగంగా శుక్రవారం పుష్పాలు ఇస్తూ నిరసన తెలిపారు. మాజీటి శివశ్రీనివాసరావు, ధనశ్రీ, తదితరులు పాల్గొన్నారు. **పామర్రు :** బెదిరింపులకు లొంగేది లేదని అంగన్వాడీల సంఘం అధ్యక్షురాలు కొడాలి ఉమారాణి అన్నారు. దీక్షలకు మర్రెపు పోలి నాయుడు, పద్మ, రంగరావు, ప్రసాద్ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

వైభవంగా ముగిసిన పైడమ్మ జాతర

పెడన : పైడమ్మ జాతర ఉత్సవాలు శుక్రవారం ముగిసాయి. 11 రోజుల పాటు వేలాదిగా భక్తులు పైడమ్మ తల్లిని దర్శిం చుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఎస్సై రవిచంద్రకుమార్ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సేవలందించారు. పురపాలక సంఘం ప్రతి రోజూ ఉత్సవ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచింది. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతర ఉత్సవాలను విజయవంతం చేశారు. ఈవో తిక్కిశెట్టి వీరవెంకట మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయు నందనరావు పర్యవేక్షించారు. శుక్రవారం రాత్రి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిం చారు. ఉత్సవాల ముగింపు అనంతరం 12న ఉత్సవ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

విద్యార్థులకు భాషపై పట్టు ఉండాలి : ఆర్డీవో

మచిలీపట్నం టౌన్ : విద్యార్థులకు భాషపై పట్టు ఉంటే సత్ఫలితాలు సాధించవచ్చని ఆర్డీవో ఎం.వాణి అన్నారు. సన్ స్టార్ స్కూల్ లో ద్విభాషా పుస్తకాన్ని శుక్రవారం ఆమె ఆవిష్కరించారు. స్టార్ సంస్థల డైరెక్టర్ శ్రీరామ్, ఆధ్యాత్మికవేత్త పేర్నెటి గంగాధరరావు, ప్రిన్సిపాల్ గౌసియా బేగం తదితరులు పాల్గొన్నారు.

పామర్రులో రంగవల్లుల పోటీలు



పామర్రు : సంప్రదాయాన్ని ప్రతిబింబించే రంగవల్లుల పోటీలు ఐకమత్యాన్ని పెం పొందిస్తాయని ఎంఈవో గుమ్మడి పద్మవాణి అన్నారు. ఏఏఎస్ఎం ఇంగ్లీషు మీడి యం హైస్కూల్లో శుక్రవారం విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా హెచ్ఎంలు యార్లగడ్డ మృదులారాణి, ఆర్.లక్ష్మీకుమారి, పి.రంగవల్లి వ్యవహరించారు. విజేతలను అభినందించారు. ప్రిన్సిపాల్ అన్నపురెడ్డి పూర్ణచంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శామ్యూల్, సిబ్బంది పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా ఫ్యామిలీ డాక్టర్



డాక్టర్ వెళ్లిపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ

బంటుమిల్లి, జనవరి 5 : ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం తూతూ మంత్రంగా నిర్వహించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆముదాలపల్లి గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. అయితే, డాక్టర్ ఓపీ చూసిన అనంతరం బయటకి వెళ్లిపోయారు. మధ్యాహ్నం నుంచి కేవలం సిహెచ్‌వో, ఆశా వర్కర్ మాత్రమే విధుల్లో ఉన్నారు. ఏఎన్ఎం, ఇద్దరు ఆశావర్కర్లు కళ్లజోళ్ల పంపిణీకి వెళ్లినట్లు చెబుతున్నారు. పెదతుమ్మిడికి చెందిన ప్రసాద్ అనే యువకుడు కుక్క కరవడంతో ఇంజక్షన్ నిమిత్తం ఆసుపత్రికి వెళ్లగా ఎవరూ లేకపోవడంతో చినపాండ్రాక ఆసుపత్రికి వెళ్లి ఇంజక్షన్ చేయించుకోవాల్సి వచ్చిందని వాపోయాడు. డాక్టర్ సువర్చలను వివరణ కోరగా, డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఫోన్ రావడంతో ఒక ఫైల్ అర్జంటుగా పంపాల్సి వచ్చిన మీదట పెదతుమ్మిడి పీహెచ్‌సీకి వెళ్లినట్లు తెలిపారు.

ఆధారాలు చూపని నగదు సీజ్

కృత్తివెన్ను : పల్లెపాలెం చెక్‌పోస్టు ఎస్సై గణేష్ కుమార్ తన సిబ్బందితో తనిఖీ చేసి ఎటువంటి ఆధారాలు చూపని రూ.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. నగదును తహసీల్దార్‌కు అప్పగిస్తామని, తగిన ఆధారాలు చూపి తీసుకోవాలని సూచించామన్నారు. **అవనిగడ్డ రూరల్ :** పులిగడ్డ టోల్ ప్లాజా చెక్‌పోస్టు వద్ద శుక్రవారం సీఐ ఎల్.రమేష్, సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. కారులో ఎటువంటి రశీదులు చూపని రూ.2 లక్షలు స్వాధీనం నచేసుకుని కేసు నమోదు చేశారు.

టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనర్‌గా పి.వి.ఫణికుమార్



మచిలీపట్నం టౌన్ : బ్రాహ్మణుల అభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉందని మాజీ ఎంపీ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు అన్నారు. టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనర్‌గా పి.వి. ఫణికుమార్‌ను నియమించారు. ఫణికుమార్‌కు కొనకళ్ల శుక్రవారం నియామక పత్రం అందజేశారు.

పేర్నిపై టీడీపీ కార్పొరేటర్ల ఫైర్

మచిలీపట్నం టౌన్ : అభివృద్ధి అంటే గంజాయి పొట్లాలు, ఫుడ్ కోర్టుల పేరుతో ఆక్రమణలు మాత్రమే ఎమ్మెల్యే పేర్ని నానికి కనపడుతున్నాయని టీడీపీ కార్పొరేటర్లు సమతాకీర్తి, నాగరాము, ఆనంద్, సుధాకర్, దేవరపల్లి అనిత ధ్వజమెత్తారు. అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కార్పొరేటర్లు మాట్లాడారు. రాబోయే రెండు నెలల్లో ప్రభుత్వానికి కాలం చెల్లుతుందన్నారు.

సప్తగిరి బ్యాంకు బ్రాంచి ప్రారంభం



కృత్తివెన్ను, జనవరి 5 : శీతనపల్లిలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు 240వ శాఖను బ్యాంకు చైర్మన్ ఎఎస్ఎన్ ప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. ఖతాదారులకు మెరుగైన సేవలను అందిస్తామన్నారు. గుడివాడ, విజయవాడ రిజనల్ మేనేజర్లు శివరాం ప్రసాద్, నాయుడు బ్రహ్మయ్య, బ్రాంచ్ మేనేజర్ వరుణ్ సాగర్, ప్రముఖులు వట్టికూటి రామచంద్రరావు, చిలుకూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



గుడివాడ రైల్వే స్టేషన్‌కు ఐఎస్‌వో సర్టిఫికెట్

గుడివాడ : గుడివాడ రైల్వే స్టేషన్‌ను ఐఎస్‌వో 14001: 2015 లభించింది. రైల్వే డివిజన్ మేనేజర్ చేతుల మీదగా గుడివాడ రైల్వే స్టేషన్ సిబ్బంది అందుకున్నారు. ప్రయాణికుల భద్రత , పరిశుభ్రత విషయంలో అత్యుత్తమ సేవలందించినందుకు పురస్కారం లభించినట్లు స్టేషన్ మేనేజర్ రమేష్‌బాబు తెలిపారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి

కోడూరు : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బడేవారిపాలెం గ్రామానికి చెందిన అరజా వేణుగోపాల్ (17) శుక్రవారం మృతి చెందాడు. గురువారం రాత్రి అవనిగడ్డ నుంచి ద్విచక్ర వాహనంపై బడేవారిపాలెం వెళ్తున్న వేణుగోపాల్ విశ్వనాథపల్లి గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న గోతిలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. విజయవాడలో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ వేణుగోపాల్ మృతి చెందాడు. ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు.

జలధీశ్వరస్వామి సేవలో యార్లగడ్డ

ఘంటసాల : బాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామిని టీడీపీ గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు కుటుంబసమేతంగా శుక్రవారం ఆయన దర్శించుకున్నారు. అర్చకులు చావలి కృష్ణకిషోర్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాముఖ్యతను జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ తెలియజేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, కొడాలి ఏఎంసీ మాజీ చైర్మన్ తుమ్మల చౌదరిబాబు, గ్రామ ఉపసర్పంచ్ భానుప్రకాష్, బండి పరాత్పరరావు, వేమూరి సాయి వెంకటరమణ పాల్గొన్నారు.

11 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

పామర్రు : బాహూజీపేట, కొండిపర్రు గ్రామంలో పేకాట ఆడుతున్న 11 మందిని ఎస్సై ప్రవీణ్ కుమార్ రెడ్డి శుక్రవారం అరెస్టు చేశారు. నిందితుల వద్ద రూ.8440, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



పెనుముత్స (పమిడిముక్కల) : విద్యతోనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని ఎన్ఆర్ఐ మొవ్వ పూర్ణచంద్రరావు అన్నారు. పెనుముత్సలో ఎంపీపీ పాఠశాలలో మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు కుటుంబ సభ్యులతో కలిసి అందజేశారు. పాఠశాలలో విద్యార్థుల మధ్యాహ్న భోజనం కోసం వంద స్టీలు పళ్లాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్టేషనరీ అందజేశారు. కష్టపడి చదివి మెరిట్ సాధించే వారికి సహాయం అందించి ప్రోత్సహించడానికి ముందుంటానన్నారు. స్వరూప, రాము, డాక్టర్ సుజన, సర్పంచ్ దండమూడి అచ్చమాంబ, హెచ్ఎం శ్రీధర్, పాగోలు కుమార్ తదితరులు పాల్గొన్నారు.